# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో సంజీవని ప్రాజెక్టు అమలుపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

2. **రహదారి ప్రమాదాల నివారణకు ఆధునిక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించిన రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి**

3. **కేంద్ర ప్రభుత్వ నిధులతో నెల్లూరు నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ**

4. **"దీన్ దయాళ్ ఉపాధ్యాయ, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్" పురస్కారాల్లో 5 అవార్డులకు ఎంపికైన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పలు అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పౌరుడికి డిజిటల్ ఆరోగ్య రికార్డులను అందుబాటులోకి తెచ్చేలా అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్టు పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు విస్తరించిన సంజీవని పైలట్ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధం చేసిన ప్రణాళికలు, అమలు తీరుపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం క్వాంటం కంప్యూటర్స్ తయారీ సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు తర్వాత రియల్ టైం గవర్నెన్స్ ఆర్టీజీపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో రహదారి ప్రమాదాల నివారణ, భద్రతకు ఆధునిక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు డ్రైవర్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయివేటు బస్సు యజమానులు అంగీకారం తెలిపారని చెప్పారు. డ్రైవర్ ముఖం, వాహనం ముందుభాగం డ్యాష్‌క్యామ్‌ల ద్వారా రికార్డు చేసేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొబైల్ వినియోగం, ధూమపానం వంటి చర్యలపై కంట్రోల్ రూమ్ నుండి డ్రైవర్లకు హెచ్చరికలు పంపవచ్చని చెప్పారు. ప్రస్తుతం IRA ట్రావెల్స్‌కు చెందిన 24 బస్సుల్లో అమలు చేస్తున్నామని, త్వరలో అన్ని బస్సులకు ఈ వ్యవస్థను విస్తరిస్తామని తెలిపారు.

---

కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఈరోజు జరిగిన మందుగుండు  పేలుడు ఘటనలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారని చెప్పారు. పోలీస్‌స్టేషన్ పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వి.అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని  ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని సూచించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీస్ స్టేషన్లలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని మంత్రి  ఆదేశించారు.

---

కేంద్ర ప్రభుత్వ  నిధులతో నెల్లూరు నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి  పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని జేమ్స్ గార్డెన్ లో  నూతనంగా ఏర్పాటు చేసిన  ఎన్.టి.ఆర్.సుజల వాటర్ ట్యాంక్ ను మంత్రి ఈ రోజు  ప్రారంభించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... నెల్లూరు నగరంలో 120  నీటి శుద్ధి కేంద్రాలను  ఏర్పాటు చేసి రోజుకు 6 లక్షల లీటర్ల త్రాగునీరును ప్రజలకు అందిస్తామన్నారు. ఇప్పటికే 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.

---

రాష్ట్ర గవర్నర్ ఎస్  అబ్దుల్ నజీర్ తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఈరోజు  దర్శించుకున్నారు. ఆలయం  మహద్వారం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు గవర్నర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలను టిటిడి అధికారులు అందజేయగా..వేదపండితులు వేద ఆశీర్వచనం చేశారు. మరోవైపు తిరుమల  శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల వసంతోత్సవాలలో భాగంగా  స్వర్ణ రథోత్సవాన్ని ఈ రోజు నిర్వహించారు.  శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు తిరుమల మాడ వీధుల్లో స్వర్ణ రథంపై ఊరేగుతూ  దర్శనమిచ్చారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రథన్ని ముందుకు లాగారు.

---

దేశంలోనే డ్రోన్ సాంకేతికత, తయారీ ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని  గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.  పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటు చేసిన  డ్రోన్స్ ఎక్స్పీరియన్స్  కేంద్రాన్ని శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజుతో కలిసి  మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్స్ తయారీ, వినియోగం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.  అనంతరం మంత్రి మాట్లాడుతూ, దేశంలో తొలి డ్రోన్ ఎక్స్పీరియన్స్ కేంద్రం రాష్ట్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డ్రోన్ వంటి నూతన సాంకేతికత వినియోగం  ద్వారా  వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచవచ్చని తెలిపారు.  మారుమాల ప్రాంతాల్లో అత్యవసర మందుల సరఫరా వంటి అంశాల్లో  డ్రోన్  సాంకేతిక వినియోగం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

---

యువత మాదకద్రవ్యాలు వంటి  వ్యసనాలకు దూరంగా ఉండాలని  కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా  అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు  ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్  ప్రచార పత్రికను  మచిలీపట్నంలో ఆయన ఈ రోజు  ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా విస్తృతస్థాయిలో  చేసిన తనిఖీల్లో  జూదం, ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్, కోడిపందాలు వంటి అసాంఘిక చర్యలకు పాల్పడిన 130 మందిని అదుపులోకి తీసుకున్నామని  తెలిపారు. నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు అయ్యేలా పోలీసులకు నేరుగా సమాచారం తెలిపేందుకు  9440904702 టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేశామని  తెలుపుతూ.

వాయిస్  30 సెకన్లు

---------------------------

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ఐదు  జాతీయ స్థాయి  పురస్కారాలు లభించాయి. "దీన్ దయాళ్ ఉపాధ్యాయ, నానాజీ దేశ్ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్" పురస్కారాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ కు మొత్తం 5 జాతీయ అవార్డులు లభించాయి.. పంచాయతీరాజ్ శాఖలో రెండు విభాగాల్లో ప్రథమ పురస్కారం, ఒక విభాగంలో ద్వితీయ పురస్కారం, మరో రెండు విభాగాల్లో తృతీయ పురస్కారం లభించాయి. అలాగే " రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్",  "జల్ సంచయ్ – జన్ భాగీదారి" అమలులోనూ రాష్ట్రం  ప్రథమస్థానంలో నిలిచింది.

---------------------------

జైన మతంలోని 24 మంది తీర్థంకరుల్లో ఒకరైన వర్ధమాన మహావీరుడి జయంతిని ఈ రోజు జరుపుకుంటున్నాం. జైన తత్వ సిద్ధాంతాలను క్రమబద్ధీకరించిన వర్ధమాన మహావీరుడు చైత్ర శుద్ధ త్రయోదశి రోజున, క్రీస్తు పూర్వం 599 సంవత్సరంలో జన్మించారు. వర్ధమాన మహావీరుడు మొత్తం 55 ప్రవచనాలు, ఉత్తరాధ్యయన సూత్రాలు అనే ప్రసంగాలు చేశారు. అహింసో పరమోధర్మ: అని బోధించారు. అహింసతో జీవిస్తూ మోక్షాన్ని సాధించాలనే ఆయన బోధనలు నేటికీ ప్రపంచశాంతికి మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి.

---------------------------

నిరంతరం వార్త సేకరణలో ఉండే విలేకరులు వారి ఆరోగ్యంపై  శ్రద్ధ వహించాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. అనంతపురంలోని  కలెక్టర్ కార్యాలయంలో  జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో  జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన  ఉచిత  వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఈ రోజు ప్రారంభించారు.ఈ  సందర్భంగా ఆయన  మాట్లాడుతూ,  వైద్య శిబిరంలో వివిధ విభాగాల్లో నిపుణులైన వైద్యులు సేవలు అందిస్తారని చెప్పారు,  జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల జూనియర్ కళాశాలలకు ఒంటిపూట తరగతులు నిర్వహించాలని ఇంటర్మీడియట్ విద్య  సంచాలకులు  రంజిత్ బాషా ఆదేశాలు జారీ చేశారు.   ఏప్రిల్ 1 వ తేదీ  నుంచి 23 వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కళాశాలలు నిర్వహించాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో అభివృద్ధి పనుల అమలుకు నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పాడేరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో రహదారి పనులు, తాగునీటి సదుపాయాలు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు.

======================